

మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

సమాజాన్ని ప్రభావితం చేసిన క్రీస్తు బోధనలు: ఎమ్మెల్యే

కొత్తపేట, జూలై 17(ఆంధ్రజ్యోతి): మానవ సమాజాన్ని క్రీస్తు బోధనలు ప్రభావితం చేశాయని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. కొత్తపేట డివిజన్ పరిధి భరత్‌నగర్‌లోని హోసన్న మందిర్ చర్చిలో గురువారం పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ 15వ వార్షికోత్సవాలు నిర్వహించారు. వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. బైబిల్ సూక్తులు చదువుతూ ప్రార్థనలు చేస్తూ పాస్టర్లు సందేశాలిచ్చారు. కార్యక్రమంలో పాస్టర్లు ఆనంద్, దయానంద్‌రావు, ప్రసాద్, సుదర్శన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో అక్రమ బేస్‌మెంట్, అలుగు కాల్వపై కట్టిన ప్రికాస్ట్ కూల్చివేత



ప్రభుత్వ స్థలంలో బేస్‌మెంట్ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న దృశ్యం

అబ్దుల్లాపూర్‌మెట్ : ప్రభుత్వ భూమి ఆక్రమణకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి హెచ్చరించారు. అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 283లోని ప్రభుత్వ స్థలంలో గుట్టుచప్పుడు కాకుండా రాత్రికి రాత్రే నిర్మించిన బేస్‌మెంట్‌ను తహసీల్దార్ ఆదేశాల మేరకు ఆర్ఐ రాంబాబు గురువారం ఎక్సకవేటర్‌తో కూల్చివేశారు. అదేవిధంగా బైరాన్‌ఖాన్‌చెరువు అలుగు కాల్వపై కట్టిన ప్రికాస్ట్ గోడలను కూల్చివేయించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలం ఆక్రమణలపై ఫిర్యాదులు వచ్చిన వెంటనే వాటిపై చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్‌ను కలిసిన గౌడ సంఘం నేతలు

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనాజ్‌పూర్ గ్రామ నూతన గౌడ సంఘం సభ్యులు గురువారం బాటసింగారంలోని పండ్ల మార్కెట్‌లో గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామంలో గౌడ సంఘం కమ్యూనిటీ భవనం కావాలని ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి సహకారంతో నిధులను మంజూరు చేయిస్తానని ఆయన గౌడ సంఘం నాయకులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సీహెచ్ భాస్కరాచారి, సంఘం నేతలు పాల్గొన్నారు.

నీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు : అరుణ

సైదాబాద్: డివిజన్‌లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నట్లు కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డి తెలిపారు. గురువారం గ్రీన్ ల్యాండ్ కాలనీలో నూతన పైప్‌లైన్ల పనులను జలమండలి అధికారులతో కలిసి పరిశీలించారు. పెరుగుతున్న జనవాసాలకు అనుగుణంగా పైప్‌లైన్లు యుద్ధప్రాతిపదికన మార్చాలని సూచించారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం హస్మత్ అలీ, మేనేజర్ శ్రవణ్‌కుమార్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ మనోహర్, నర్సింహ పాల్గొన్నారు.

రామచందర్‌రావును కలిసిన కార్పొరేటర్

చంపాపేట, జూలై 17(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావును పార్టీ కార్యాలయంలో గురువారం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, స్థానిక కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి తదితరులు మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ డివిజన్ అధ్యక్షుడు పోరెడ్డి రవీందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు దశరథ్‌గౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి, టింగ్లీకర్ రాజేష్, శ్రీనివాస్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతతో శ్మశానవాటిక పనులు చేపట్టాలి: లచ్చిరెడ్డి

వనస్థలిపురం, జూలై 17(ఆంధ్రజ్యోతి): నాణ్యతతో శ్మశానవాటిక పనులు చేపట్టాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సాహెబ్‌నగర్‌లోని ఎస్సీ శ్మశానవాటికలో చేపడుతున్న అభివృద్ధి పనులను సంబంధిత అధికారులతో కలిసి కార్పొరేటర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతాలోపాలు లేకుండా అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. అనంతరం ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన భవన నిర్మాణం చేపట్టాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ బడుల్లో విద్య

మన్సూరాబాద్, జూలై 17(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా నేడు ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలు, సదుపాయాలతో విద్యనందించడం జరుగుతుందని నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణాసురేంద్రనాథ్‌యాదవ్ పేర్కొన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని జైపురికాలనీలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు ప్రభుత్వం ఆధ్వర్యంలో పంపిణీ చేసిన నోటు పుస్తకాలను ఎంఈఓ రామారావు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ వరలక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బత్తుల శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆమె విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనంతరెడ్డి, మేరీ బ్యూల, గాయత్రి, రాజేశ్వరి, రమాదేవి, అంగన్‌వాడీ టీచర్ లలిత పాల్గొన్నారు.

రూ.16లక్షలతో నాలా పనులు ప్రారంభం

నాగోల్ డివిజన్ పరిధిలోని అరుణోదయకాలనీ రోడ్డు నంబర్.6లో రూ.16లక్షలతో చేపట్టదలచిన వరదనీటి కాలువ పైప్‌లైన్ పనులను స్థానిక కార్పొరేటర్ చింతల అరుణాసురేంద్రనాథ్‌యాదవ్ గురువారం ప్రారంభించారు. పనుల్లో నాణ్యత పాటించాలని ఈ సందర్భంగా సంబంధిత కాంట్రాక్టర్‌కు ఆమె సూచించారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేంద్రనాథ్‌యాదవ్, బీజేపీ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి: కార్పొరేటర్

చాదర్‌ఘాట్, జూలై 17(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మూసారాంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి అన్నారు. గురువారం మూసారాంబాగ్‌లోని ప్రభుత్వ బీసీ విద్యార్థుల హాస్టల్‌లో శాలివాహననగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన ఉచిత వైద్య పరీక్షా శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. వైద్య పరీక్షలు చేయించుకున్న విద్యార్థులకు మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శాలివాహననగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ తరుణ్ పాల్గొన్నారు.

సమన్వయంతో సమస్యల పరిష్కారానికి కృషిచేయాలి

- జీహెచ్‌ఎంసీ హయత్‌నగర్ సర్కిల్ ఉపకమిషనర్ వంశీకృష్ణ



సమావేశంలో కార్పొరేటర్లు, అధికారులు

ఎల్బీనగర్, జూలై 17(ఆంధ్రజ్యోతి): శాఖల మధ్య సమన్వయంతో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జీహెచ్‌ఎంసీ హయత్‌నగర్ సర్కిల్ ఉపకమిషనర్ వంశీకృష్ణ సూచించారు. వర్షాకాలం, బోనాల పండుగ నేపథ్యంలో గురువారం సర్కిల్ కార్యాలయంలో కార్పొరేటర్లు, వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మాన్సూన్ ఎమర్జెన్సీ పనులను హైడ్రాకు అప్పజెప్పడంతో శాఖల మధ్య సమన్వయంతో నాలాలు పూడికతీయడం, ట్రాఫిక్ మళ్లింపు, వర్షపునీరు సాఫీగా ప్రవహించేలా అడ్డంకులు తొలగించడం, వాటర్ స్టాగ్నేషన్ పాయింట్లను ఎప్పటికప్పుడు క్లియర్ చేయడం, పడిపోయిన చెట్లను వెంటనే తొలగించడం వంటి పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, నవజీవన్‌రెడ్డి, మొద్దు లచ్చిరెడ్డి, చింతల అరుణ సురేందర్‌యాదవ్, జీహెచ్‌ఎంసీ ఈఈ రమేష్‌బాబు, డీఈలు కనకయ్య, మహ్మద్‌రఫీ, ఏఈలు లక్ష్మీదీపక్, స్వప్న, హేమునాయక్, గోపాలకృష్ణ, శానిటేషన్ డీఈ నీలిమ, యూబీడీ మేనేజర్ సత్యనారాయణ, ఏఈ ఎలక్ట్రికల్ ప్రసాద్, సీఐలు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సూర్యనాయక్ పాల్గొన్నారు.

బోనాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్
- 47 ఆలయాలకు బోనాల చెక్కులు పంపిణీ



బోనాల చెక్కులు పంపిణీ చేస్తున్న వేణుగోపాల్, సబితారెడ్డి, చల్లా

సరూర్‌నగర్, జూలై 17(ఆంధ్రజ్యోతి): భక్తుల అభీష్టానికనుగుణంగా రాష్ట్రంలో అన్ని పండుగలను ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తున్నదని, ఇందులో భాగంగానే బోనాల పండుగ సందర్భంగా అమ్మవార్ల ఆలయాల నిర్వహణ, అలంకరణ నిమిత్తం ఆర్థిక సాయం అందజేస్తున్నదని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ అన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో గల 47 ఆలయాలకు మంజూరైన బోనాల చెక్కులను గురువారం జిల్లెలగూడలోని వేంకటేశ్వరస్వామి ఆలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి, టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాకు అద్దం పట్టే బోనాల పండుగను భక్తి శ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రజలపై, ప్రభుత్వంపై అమ్మవార్ల ఆశీర్వాదం ఉండాలని కోరుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారంలో ఏ ప్రభుత్వం ఉన్నా ఆలయాల అభివృద్ధికి కట్టుబడి ఉండాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో బోనాల చెక్కులను ప్రవేశపెట్టామని, ఈ పథకం శాశ్వతంగా కొనసాగాల్సిందేనని ఆమె అన్నారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ అధికారులు, పలువురు ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

బోనాల జాతర పోస్టర్ ఆవిష్కరణ

ఆషాఢ మాస బోనాల జాతరకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం మీర్‌పేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హర్కర వేణుగోపాల్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, ప్రచార కమిటీ సభ్యుడు సామిడి గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- సౌత్‌ఈస్ట్ జోన్ ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ రామదాసు



డ్రైవర్లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సౌత్‌ఈస్ట్ జోన్ ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ రామదాసు, టీటీఐ ఇన్‌స్పెక్టర్ అశోక్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అశోక్

చాదర్‌ఘాట్, జూలై 17(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అప్పుడే రోడ్డు ప్రమాదాలను అరికట్టడంలో చేయూతనిచ్చిన వారవుతారని సౌత్ ఈస్ట్ జోన్ ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ రామదాసు తేజావత్ అన్నారు. గురువారం రోడ్డు భద్రతపై ఆర్టీసీ దిల్‌సుఖ్‌నగర్ డిపోలోని డ్రైవర్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలామంది వాహనదారులు వాహనాలను చాలా నిర్లక్ష్యంగా నడుపుతున్నారని, దీంతో ఎదుటివారు ప్రమాదాలకు గురవ్వడంతోపాటు వాహనం నడిపే వాహనాదారుడు కూడా ప్రమాదానికి గురవుతాడనే విషయాన్ని గుర్తించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ అనేది ప్రతీ ఒక్కరి బాధ్యతగా భావించాలని ఆయన సూచించారు. బేగంపేట ట్రాఫిక్ టీటీఐ ఇన్‌స్పెక్టర్ నాగుల అశోక్ మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల ద్వారా ప్రతి రోజు 80లక్షల మంది ప్రయాణికులు ప్రయాణిస్తున్నారని తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం అంటేనే సురక్షితమైన ప్రయాణమన్నారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రత నియమాలను తప్పక పాటిస్తామంటూ ప్రతిజ్ఞ చేయించారు. మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ టి.అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులను డ్రైవర్లు నిర్ణీత బస్టాపుల్లోనే నిలపాలన్నారు. దిల్‌సుఖ్‌నగర్ డిపో మేనేజర్ సమత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బేగంపేట టీటీఐ సిబ్బంది ఎండీ అయాన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పండుగలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలి

- సౌత్‌ఈస్ట్ జోన్ అడిషనల్ కమిషనర్ శ్రీకాంత్



కమిషనర్‌కు ఆహ్వాన పత్రిక అందిస్తున్న పోచమ్మ ఆలయ కమిటీ సభ్యులు

ఓల్డ్‌మలక్‌పేట, జూలై 17(ఆంధ్రజ్యోతి): ప్రతి ఏటా ఎంతో ఘనంగా నిర్వహించే బోనాల పండుగను ప్రజలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సౌత్‌ఈస్ట్ జోన్ అడిషనల్ కమిషనర్ కె.శ్రీకాంత్ సూచించారు. ఈనెల 20న ఓల్డ్‌మలక్‌పేట పోచమ్మ ఆలయంలో జరిగే బోనాల పండుగకు హాజరు కావాలని కోరుతూ ఆలయ కమిటీ సభ్యులు గురువారం కమిషనర్‌ను, మలక్‌పేట ఏసీపీ సబ్బరామిరెడ్డిలను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలంతా కలిసి మెలిసి పండుగలు జరుపుకోవాలని ఒకరి మతాన్ని మరొకరు గౌరవిస్తూ పరమత సహనం పాటించాలని కోరారు. పండుగలను దృష్టిలో పెట్టుకొని ఆలయాల వద్ద పోలీస్ భద్రత కల్పించినట్లు తెలిపారు. బోనాల ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు దేవాలయాల వద్ద ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని ఈ సందర్భంగా కమిషనర్ ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు. ఆహ్వాన పత్రిక అందించిన వారిలో ఆలయ కమిటీ సభ్యులు కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, చౌకి రవికుమార్, కె.శివరాజ్, నారాయణ రెడ్డి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

మిధానిలో హిందీ భాషపై శిక్షణా తరగతులు



హిందీ బోధనా తరగతుల ప్రారంభోత్సవంలో అదనపు జనరల్ మేనేజర్ ఎంపీ.రమేష్

చంపాపేట, జూలై 17(ఆంధ్రజ్యోతి): కంచన్‌బాగ్‌లోని భారత రక్షణరంగ సంస్థ మిశ్రధాతు నిగమ్ లిమిటెడ్(మిధాని)లో గురువారం హిందీ బోధనా పథకంలో భాగంగా ప్రబోద్, పారంగత్ శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. అధికార భాష అమలు కమిటీ ఆధ్వర్యంలో అదనపు జనరల్ మేనేజర్(ఇన్‌చార్జి మానవ వనరులు)హరికృష్ణ మార్గదర్శకత్వంలో బోధన తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు జనరల్ మేనేజర్(ఇన్‌చార్జి సెక్యూరిటీ, క్యాంటిన్, ఈఎంఎస్, టీ/డి)ఎంపీ.రమేష్ హాజరై మాట్లాడుతూ అర్హత గల ఉద్యోగులందరికీ హిందీ భాష శిక్షణా తరగతులు ఎంతో అవసరం అని అన్నారు. ఉద్యోగులు హిందీ నేర్చుకొని తమ ఉద్యోగ బాధ్యతలలో దాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో హోంమంత్రిత్వ శాఖకు చెందిన హిందీ బోధన పథకం అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.రవిచంద్రరావు, హిందీ విభాగం, కార్పొరేట్ కమ్యూనికేషన్ మేనేజర్ డాక్టర్ బి.బాలాజీ, హిందీ శాఖ ఎన్‌యుఎస్ జూనియర్ ఎగ్జిక్యూటివ్ డి.వి.రత్నకుమారి, వికాస్‌కుమార్ ఆజాద్, జైపాల్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం : దేబుకుమార్



విజేత టీంకు కప్‌ను అందజేస్తున్న జీఎస్ఐ ఏడీజీ దేబుకుమార్ భట్టాచార్య

మన్సూరాబాద్, జూలై 17(ఆంధ్రజ్యోతి): మానసిక ఒత్తిడిని జయించేందుకు క్రీడలు ఎంతగానో ఉపకరిస్తాయని నాగోల్ డివిజన్ బండ్లగూడలోని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఏడీజీ డాక్టర్ దేబుకుమార్ భట్టాచార్య పేర్కొన్నారు. జియోలాజికల్ సర్వే రిక్రియేషన్ క్లబ్ ఆధ్వర్యంలో నాలుగురోజుల పాటు నిర్వహించిన అనూప్ కాంబ్లీ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంటు గురువారం ముగిసింది. జీఎస్ఐ ఉద్యోగులంతా ఎనిమిది జట్లుగా ఏర్పడి తలపడగా ఇందులో ఎస్‌యూ తెలంగాణ టీం విజేతగా నిలిచింది. కాగా గురువారం జీఎస్ఐ ప్రాంగణంలో నిర్వహించిన ముగింపు వేడుకల్లో విజేత టీంకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన దబుకుమార్ భట్టాచార్య కప్‌ను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో డీడీజీలు డాక్టర్ ఎల్‌పీసింగ్, ఎస్ఎన్ మహాపాత్ర, ఎంఎన్ ప్రవీణ్, మారుతి, డైరెక్టర్లు, హెచ్ఓఓలు హెచ్ఎం మిశ్రా, పీవీవీఆర్‌శర్మ, అపూర్వ బెనర్జీ, శైలేంద్రకుమార్‌సింగ్, తారకేశ్వర్‌రావు, జీఎస్ఆర్‌సీ కమిటీ సభ్యులు నరేందర్, గుండా రమేష్, సీపీ మాథ్యూ, రసూల్‌ఖాన్, శ్రీనివాసరావు, శేఖర్, ఝాన్సీ అనురాధ, రమేష్ గోగులత్, సీహెచ్ తేజ, వివిధ టీంల సభ్యులు పాల్గొన్నారు.

రేపు కంఠ మహేశ్వరస్వామి బోనాలు

మన్సూరాబాద్, జూలై 17(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని కంఠమహేశ్వరస్వామి బోనాల ఉత్సవాలను శనివారం నిర్వహిస్తున్నట్లు మన్సూరాబాద్ గౌడ సహకార సంఘం అధ్యక్షుడు, కంఠమహేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ పాతూరి శ్రీధర్‌గౌడ్ తెలిపారు. ఆలయ ప్రాంగణంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో బోనాల ఉత్సవాలకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌గౌడ్ మాట్లాడుతూ కంఠమహేశ్వరుడి బోనాలకు ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్, సీనియర్ నాయకుడు ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్‌తో పాటు పలువురు గౌడ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు పాల్గొననున్నట్లు తెలిపారు. పాతూరి రమేష్‌గౌడ్, వెంకటస్వామిగౌడ్, నరేష్‌గౌడ్, సాయిదాస్‌గౌడ్, త్రిలోక్‌నాథ్‌గౌడ్, సునీల్‌గౌడ్, సాత్విక్‌గౌడ్, అనిల్‌గౌడ్ పాల్గొన్నారు.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

వనస్థలిపురం : విద్యార్థులు చిన్నతనం నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని ఫలక్‌నామ ఇన్‌స్పెక్టర్ ఆదిరెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ రంగారెడ్డి కాలనీలోని నారాయణ సీబీఎస్ఈ పాఠశాలలో గురువారం ఇన్వెస్టిచర్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. నారాయణ విద్యాసంస్థల జీఎం గోపాల్‌రెడ్డి, ఏజీఎం రవీంద్రబాబు, ప్రిన్సిపాల్ భువనేశ్వరి, ఏఓ.శ్రీనివాస్‌గౌడ్, డీన్ సునీత పాల్గొన్నారు.

స్పెల్ బీ పోటీల్లో విద్యార్థుల సత్తా

చంపాపేట : కంచన్‌బాగ్ మిధాని టౌన్‌షిప్‌లోని బీపీ డీఏవీ పాఠశాల విద్యార్థులు ఇటీవల జాతీయ స్థాయిలో నిర్వహించిన స్పెల్‌బీ పోటీల్లో సత్తాచాటారు. గురువారం పాఠశాల ఆవరణలో విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ వివిఎస్.ప్రశాంత్ మాట్లాడుతూ 2024-25సంవత్సరానికిగాను జాతీయ స్థాయిలో జరిగిన స్పెల్ బీ పోటీల్లో పాఠశాలకు చెందిన 5వ తరగతి విద్యార్థులు పి.శ్రీహిత 59వ ర్యాంక్, జ్ఞానదిత్య 73, బి.జాన్వీ అభినయ, ఇషి 74, ఆరవ తరగతి విద్యార్థి ఎ.రిత్విక్ చౌదరి 15, 7వ తరగతి విద్యార్థి స్వరిత్ లయక్ 21, 8వ తరగతి విద్యార్థులు హరికేశవ్ 61, ఆర్యవీర్ 66, 9వ తరగతి విద్యార్థి సాయి అనుప్రియ 69, 10వ తరగతి విద్యార్థులు కె.తేజస్విని 7, ప్రణయ్ 47, లలిత్ ఆదిత్య 59వ ర్యాంక్‌లు సాధించినట్లు పేర్కొన్నారు. ఆంగ్లభాషపై పట్టు సాధించాలనే ఆత్మ విశ్వాసంతో విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనడం హర్షించదగిన విషయమని అన్నారు. కార్యక్రమంలో బీపీబీఏవీ పాఠశాల చైర్మన్ కె.మధుబాల, ఎల్ఎంసీ సభ్యులు, డీఏవీ పాఠశాల ఏఆర్ఓ ఆనందవల్లి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సుఫారీ గ్యాంగ్‌తో బావమరిదిపై హత్యాయత్నానికి పాల్పడిన బావ అరెస్టు

చాదర్‌ఘాట్, జూలై 17(ఆంధ్రజ్యోతి): భూవివాదాల్లో బావమరిదిని సుఫారీ గ్యాంగ్‌తో హత్యాయత్నానికి పాల్పడిన బావను చైతన్యపురి పోలీసులు గురువారం అరెస్టు చేశారు. వివరాల ప్రకారం.. హయత్‌నగర్ లెక్చరర్స్‌కాలనీ నివాసి రియల్ ఎస్టేట్ వ్యాపారి కొనసం వెంకట్‌రెడ్డి(50)కి ఎల్బీనగర్ చంద్రపురికాలనీ నివాసి, ఆర్టీసీ ఉద్యోగి జి.నర్సింహారెడ్డిలు వరుసకు బావ, బావమరుదులు. బావ కొనసం వెంకట్‌రెడ్డితో 2013 నుంచి బావమరిది నర్సింహారెడ్డికి భూవివాదాలు కొనసాగుతున్నాయి. ఈ వివాదాలకు కారకుడైన బావమరిదిని హత్య చేసేందుకు పలుమార్లు వెంకట్‌రెడ్డి పథకం వేశాడు. జూన్ 12న ఎల్బీనగర్ చంద్రపురికాలనీలో నివాసముంటున్న నర్సింహారెడ్డి ఇంటిపై రాళ్లు రువ్వడంతోపాటు అతని కారు అద్దాలను ధ్వంసం చేయించాడు. నర్సింహారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎల్బీనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. జూన్ 27న ఆర్టీసీ దిల్‌సుఖ్‌నగర్ డిపోలో విధులకు కారులో వెళ్తున్న నర్సింహారెడ్డిపై నలుగురు వ్యక్తులు చైతన్యపురి యూటర్న్ వద్ద దాడులు నిర్వహించారు. కారు అద్దాలు ధ్వంసం చేసి కారులో ఉన్న అతడిపై దాడి చేశారు. ఈ ఘటనలో నర్సింహారెడ్డికి గాయాలయ్యాయి. వెంటనే ఆయన చైతన్యపురి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. దాడికి కారకులైన సుభాష్, బాలమూరీ, మధు, నరేందర్‌గౌడ్‌లను బుధవారం అరెస్టు చేసి విచారణ జరపగా నర్సింహారెడ్డిని హత్య చేసేందుకు సుపారీగా రూ.5లక్షలు ఇచ్చేందుకు అంగీకారం చేసుకున్న విషయం బయటపడిందని పోలీసులు తెలిపారు. ముందస్తుగా రూ.లక్షన్నర తీసుకుని దాడులు చేసినట్లు పోలీసులు విచారణలో వెల్లడైంది. సుపారీ ఇచ్చి హత్యాయత్నానికి కారకుడైన కొనసం వెంకట్‌రెడ్డిని చైతన్యపురి పోలీసులు గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. కేసును చైతన్యపురి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



తలసేమియా ఉచిత వైద్య శిబిర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, కామినేని సూపరింటెండెంట్ డా.కె.అంజయ్య

కామినేనిలో తలసేమియా ఉచిత సేవలు భేష్

- రంగారెడ్డి డీఎంహెచ్ఓ వెంకటేశ్వర్‌రావు

మన్సూరాబాద్, జూలై 17(ఆంధ్రజ్యోతి): తలసేమియా బాధితులకు కామినేని ఆస్పత్రి ఆధ్వర్యంలో చేపడుతున్న ఉచిత సేవలు అభినందనీయమని రంగారెడ్డి జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బలుసు వెంకటేశ్వర్‌రావు పేర్కొన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గురువారం ఎల్బీనగర్ కామినేని ఆస్పత్రి ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి తలసేమియా బాధితుల కోసం రూపొందించిన ఉచిత వైద్య పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ పిల్లల్లో వచ్చే తలసేమియా వ్యాధి పట్ల కామినేని వైద్యులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించి ఉచిత హెమటాలజీ శిబిరం నిర్వహించడం శుభపరిణామన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డా.పాపారావు, డా.పూనమ్, డా.రాధిక, జిల్లా ఉప వైద్యాధికారులు డా.పూర్ణిమ, డా.వి.విజయలక్ష్మి, డా.గీత, డా.నాగేంద్రబాబు, ఆనంద్‌బాబు పాల్గొన్నారు.

40 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు

అబ్దుల్లాపూర్‌మెట్ : ఆర్థిక స్తోమత కారణంగా కంటి ఆపరేషన్లు చేయించుకోలేని నిరుపేదలను చేరదీసి సురక్ష సేవా సంఘం ఆధ్వర్యంలో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయిస్తున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిక్కిర గోపీశంకర్‌యాదవ్ తెలిపారు. పుష్పగిరి కంటి ఆస్పత్రి, శ్రీ ధనలక్ష్మి ఆప్టికల్స్ సంయుక్త సహకారంతో గురువారం 40మంది నిరుపేదలకు కంటి ఆపరేషన్లు చేయించి వారిని ఇంటి వద్ద విడిచిపెట్టినట్లు ఆయన చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు ఏళ్లుగా నిరుపేదలకు సంఘం తరఫున కంటి ఆపరేషన్లు చేయిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 430 మంది పేదలకు ఆపరేషన్లు చేయించామన్నారు. గురువారం ఆపరేషన్లు చేయించుకున్న వారిలో అబ్దుల్లాపూర్‌మెట్, జనగాం, సంగారెడ్డి, నల్గొండ జిల్లాకు చెందిన వారు ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో రాజేష్‌గౌడ్, యాదగిరి, మహేష్, యాకుబ్, కొలవెంటి ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

గుర్రంగూడ సమస్యలపై అధికారులకు వినతి

సరూర్‌నగర్, జూలై 17(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని గుర్రంగూడలో నెలకొన్న సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాల్సిందిగా స్థానిక యువమోర్చా నేతలు మునిసిపల్ అధికారులను కోరారు. ఈ మేరకు యువమోర్చా రంగారెడ్డి జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ జక్కిడి మారుతీరెడ్డి ఆధ్వర్యంలో పలువురు నేతలు గురువారం అధికారులను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 27, 28 తేదీల్లో గుర్రంగూడలో బోనాల పండుగ జరుగనున్నదని, అయితే తమ గ్రామంలోని అన్ని రోడ్లు గుంతలమయంగా మారి ఇబ్బందులకు గురి చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అదే విధంగా సాగర్ రహదారిలోని గుర్రంగూడ జంక్షన్ నుంచి గ్రామం వరకు విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో అంధకారం నెలకొంటున్నదని, గ్రామంలోనూ అనేక వీధుల్లో లైట్లు వెలగడం లేదని ఆయన పేర్కొన్నారు. అధికారులు స్పందించి ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

బీజేపీ డివిజన్ అధ్యక్షుడిగా కిరణ్‌కుమార్




కిరణ్‌కుమార్‌కు నియామకపత్రం అందజేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్‌జీ

ఎల్బీనగర్, జూలై 17(ఆంధ్రజ్యోతి): బీజేపీ లింగోజిగూడ డివిజన్ అధ్యక్షుడిగా గుండె కిరణ్‌కుమార్ నియమితులయ్యారు. పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్‌జీలు కిరణ్‌కుమార్‌కు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ లింగోజిగూడ డివిజన్‌లో పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన పార్టీ మాజీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కార్పొరేటర్లు వంగా మధుసూదన్‌రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి, కళ్లెం రవీందర్‌రెడ్డి, కొత్త రవీందర్‌గౌడ్, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు.

వనస్థలిపురం డివిజన్ అధ్యక్షుడిగా క్రాంతిగౌడ్

వనస్థలిపురం : బీజేపీ వనస్థలిపురం డివిజన్ అధ్యక్షుడిగా కాటం క్రాంతిగౌడ్ నియామకం అయ్యారు. ఆ పార్టీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి గురువారం కాంత్రిగౌడ్ కు నియామక పత్రం అందజేసి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా క్రాంతిగౌడ్ మాట్లాడుతూ ముప్పై ఏళ్లుగా అఖిల భారత విద్యార్థి పరిషత్, బీజేవైఎం, ఓబీసీ మోర్చా, బీజేపీ నాయకుడిగా తాను చేసిన సేవలను గుర్తించిన పార్టీ జిల్లా నాయకత్వం వనస్థలిపురం డివిజన్ అధ్యక్షుడిగా నియమించడం సంతోషకరం అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ప్రభరి సుభాష్‌చందర్, సామ రంగారెడ్డి, కొత్త రవీందర్‌గౌడ్, వంగ మధుసూదన్‌రెడ్డి, కళ్లెం రవీందర్‌రెడ్డి, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, అంజన్‌కుమార్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకోవాలి



హెల్మెట్ వాడకం ప్రాధాన్యతను వివరిస్తున్న టీటీఐ ఇన్‌స్పెక్టర్ రాచపుడి

కొత్తపేట, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకోవాలని టీటీఐ ఇన్‌స్పెక్టర్ రాచపుడి సూచించారు. గురువారం బాలాపూర్ ఎడిఫై వరల్డ్ స్కూల్ నుంచి 76 మంది విద్యార్థులు రాచకొండ పిల్లల ట్రాఫిక్ ట్రెయినింగ్ పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. విద్యార్థులు డ్రైవింగ్ లైసెన్సు పొందకుండా వాహనాలు నడపరాదని తెలిపారు. నిబంధనలను తప్పక పాటించాలని, ఉల్లంఘించరాదని ఆయన వివరించారు. కార్యక్రమంలో టీటీఐ ఇన్‌స్పెక్టర్ ఎస్ఓపీ అమరవర్ధన్‌రెడ్డి, ఏఎస్ సోమ్‌నాథ్, సిబ్బంది రమేష్, సేఫ్టీ ట్రెయినర్ ప్రవీణ్ పాల్గొన్నారు.